రాష్ట్రానికి పొంచి ఉన్న 'డానా' ముప్పు!

- బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం
- 9 జిల్లాలకు వర్షసూచన



చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఈనెల 23న తుఫాను ఏర్పనుందని, ఆ తుఫానుకు 'డానా' అనే పేరు పెట్టినట్లు భారత వాతావరణ పరిశోధనా కేంద్రం ప్రకటించింది. మధ్య అండమాన్ సముద్ర పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడి ఉండటం.. దాని ప్రభావంతో ఈనెల 21న సోమవారం తూర్పు మధ్య బంగాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ తుఫాను కారణంగా కోయంబత్తూరు, తిరుప్పూరు, నీలగిరి సహా తొమ్మిది జిల్లాల్లో మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా కదులుతూ ఈ నెల 23న వాయుగుండంగా మారనుంది. ఈ 'డానా' తుఫాను రాష్ట్రంలోని సముద్రతీరాలను దాటుకుని ఒడిశా, పశ్చిమబెంగాల్ దిశగా తీరం దాటే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ తుఫాను కారణంగా రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఇటీవలే రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు వేగంగా ప్రవేశించి కుండపోత వర్షాలను కురిపించింది. అటు పిమ్మట బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండగంగా మారి, నత్తనడకన కదులుతూ చెన్నై - నెల్లూరు మధ్య ఎలాంటి తీవ్ర పరిస్థితులు కలిగించకుండా చుక్క చినుకు కూడా రాల్చకుంటా గుట్టు చప్పుడు కాకుండా తీరం దాటింది. ఈ పరిస్థితులలో బంగాళాఖాతంలో కేంద్రీకృతమయ్యే ఈ డానా తుఫాను కారణంగా సముద్రతీర ప్రాంతాల్లో పెనుగాలులతో చెదురుముదురుగా వర్షాలు కురవనున్నాయి. తూర్పు మధ్య బంగాళాఖాతంలో సోమవారం సాయంత్రం లోగా అల్పపీడనం ఏర్పడనుందని, దాని ప్రభావంతో సముద్రతీర ప్రాంతాల వైపు గంటలకు 45 నుండి 55 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయి. బుధవారం గంటకు 90 నుండి 110 కి.మీల వేగంతో పెనుగాలులు వీచి రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో డానా తుఫానుకు పోటీగా అరేబియా సముద్రంలోనూ ఓ వాయుగుండం ఏర్పడనుందని కూడా తెలిపారు. ఈ రెండు వాయుగుండాలు వేర్వేరు దిశలలో పయనించనున్నాయి. తుఫాను ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ నెల 22, 23, 24 తేదీలలో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో చెదురుముదురుగా వర్షాలు కురవనున్నాయి. బంగాళాఖాతంలో అల్పవాయుపీడనం ఏర్పడనుండటంతో రానున్న 24 గంటల్లో ధర్మపురి, సేలం, కృష్ణగిరి, ఈరోడ్, తిరుపత్తూరు, వేలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. డానా తుఫాను ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కోయంబత్తూరు, తిరుప్పూరు, దిండుగల్, నీలగిరి, ధర్మపురి, కృష్ణగిరి, సేలం, తిరుపత్తూరు, పెరంబలూరు జిల్లాల్లో మోస్తరుగా వర్షాలు కురుస్తాయని ప్రైవేటు వాతావరణ సంస్థ నిర్వాహకుడు వెదర్‌మేన్ ప్రదీప్‌జాన్ పేర్కొన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకూ జాలర్లు చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరిక జారీ చేశారు.

టీవీకే మహానాడుకు ముమ్మరంగా ఏర్పాట్లు

- అభిమానులతో విజయ్ భేటీకి ర్యాంప్

అడయార్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో విజయ్ నెలకొల్పిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తొలి మహానాడు ఈనెల 27న భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఇందుకోసం విల్లుపురం జిల్లా విక్రవాండిలోని వి.శాలైలో ఎంపిక చేసిన స్థలంలో ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. సుమారుగా 85 ఎకరాలను సిద్ధం చేశారు. మహానాడు వేదికను 60 అడుగుల వెడల్పు, 170 అడుగుల పొడవుతో నిర్మించారు. ఈ మహానాడు తొలి రోజున పార్టీ పతాకాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, హీరో విజయ్ ఆవిష్కరిస్తారు. అక్కడ నుంచి మహానాడు వేదిక వరకు కారులో వెళ్లేందుకు తారు రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మహానాడు జరిగే ప్రాంగణమంతా రాత్రి పూట కూడా వెలుగులు విరజిమ్మేలా 937 దిమ్మెలను ఏర్పాటు చేసి, వాటికి 15 వేలకుపైగా విద్యుత్ దీపాలను అమర్చి వెలిగించనున్నారు. అలాగే, మహానాడు వేదిక ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు 500 సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. మహానాడులోకి ప్రవేశించేందుకు ఐదు ద్వారాలు, మహానాడు ప్రాంగణం నుంచి వెళ్ళేందుకు 15 మార్గాలను ఏర్పాటు చేశారు.



కార్యకర్తల కోసం 350 మొబైల్ మరుగుదొడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. మహానాడుకు వచ్చే నేతలు, కార్యకర్తల వాహనాల పార్కింగ్ కోసం 207 ఎకరాలను సిద్ధం చేశారు. ఇప్పటికే మహానాడు పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయి. అలాగే, మహానాడుకు వచ్చే కార్యకర్తలు, అభిమానులను విజయ్ కలుసుకునేందుకు వీలుగా 800 మీటర్ల మేరకు ర్యాంప్ వాక్‌ను నిర్మిస్తున్నారు.

స్వర్ణయుగంలా మా ద్రావిడ పాలన

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన సాగుతోందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. సేలం, నామక్కల్ జిల్లాల్లోని గ్రామ పంచాయతీలకు క్రీడా పరికరాలు అందజేసే కార్యక్రమం ఆదివారం సేలంలోని నెహ్రూ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఈ రెండు జిల్లాల్లోని చెందిన 707 పంచాయతీలకు చెందిన 1500 మంది క్రీడాకారులకు ఆయన వివిధ రకాలైన క్రీడా సామగ్రిని అందించారు. అలాగే 3,583 మంది లబ్ధిదారులకు రూ.33.26 కోట్ల వివిధ రకాలైన సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ఉప ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు రావడం, క్రీడాకారులకు కలైంజర్ క్రీడా సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతక్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ కోసం ప్రభుత్వం రూ.86 కోట్లను కేటాయించిందన్నారు. గత ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభించి 26 జిల్లాలల్లో ఈ సామగ్రిని పంపిణీ చేయగా, ఇపుడు సేలం, నామక్కల్ జిల్లాలకు అందించామన్నారు. ఇలాంటి చర్యలు అనేక మంది క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. కేవలం ఒక్క క్రీడాకారులకు మాత్రమేకాకుండా, మహిళలతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ద్రావిడ మోడల్ ప్రభుత్వ సర్ణయుగ పాలన అందిస్తుందన్నారు. మహా స్వయం సహాయక బృందాలకు ఇప్పటివరకు రూ.96 వేల కోట్ల రుణాలను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం కింద ఇప్పటివరకు 530 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న అల్పాహార పథకం కింద 20 లక్షల మంది, పుదుమై పెణ్ పథకం కింద 3 లక్షల మంది విద్యార్థినిలకు నెలకు రూ.వెయ్యి చొప్పున, కలైంజర్ మహిళా ప్రోత్సాహక పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1.16 కోట్ల మందికి నెలకు రూ.వెయ్యి చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు శాశ్వత ఇంటి పట్టాలను అందిస్తున్నామని, చెన్నైలో 37 వేల మందికి ఈ పట్టాలను దశలవారీగా అందజేస్తామన్నారు. ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరిస్తామన్నారు. సేలంలో క్రీడాకారులకు హాస్టల్ నిర్మించాలని కోరారని, రూ.7 కోట్లతో 60 మందికి సరిపడా హాస్టల్‌ను నిర్మిస్తామని మంత్రి చెప్పారు.



సేలంలో దివ్యాంగులకు ఉచిత సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

భాష పేరుతో ప్రజలను ఇక ఏమార్చలేరు

- కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భాష పేరుతో ఇకపై ప్రజలను ఏమార్చలేరని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. స్థానిక త్రిశూలంలోని విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గవర్నర్ రవిని రీకాల్ చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాయడం ప్రజలను పక్కదోవ పట్టించే చర్య అన్నారు. డీఎంకే-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వ అన్ని శాఖల్లో హిందీ భాషోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారని, ఆ సమయంలో కేంద్ర మంత్రులుగా డీఎంకేకు చెందిన వారు నిర్వహించిన శాఖల్లో కూడా వేడుకలు జరుపుకున్నారని మంత్రి గుర్తు చేశారు. డీఎంకే ప్రముఖుల్లో పలువురు నిర్వహిస్తున్న సీబీఎస్ఈ గ్లోబల్ విద్యా సంస్థల్లో హిందీ తరగతులు అందుబాటులో ఉన్నాయని అయితే, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి నాయకులు తాము హిందీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. భాషను అడ్డుగా పెట్టుకొని ప్రజలను మోసం చేయలేమని డీఎంకే పాలకులు వాస్తవం గ్రహించి అన్ని భాషలను సమానంగా చూడాలని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు.

దారీ తెన్నూ తెలియక...

- అయోమయంలో ఓపీఎస్ వర్గీయులు



చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ ఏకనాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించి పార్టీ నుంచి బహిష్కృతులైన మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) వర్గీయులు శాసనసభ ఎన్నికలకు యేడాది మాత్రమే మిగిలి ఉన్న సమయంలో ఏ పార్టీ వైపు అడుగులు వేయాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల జరిగిన అన్నాడీఎంకే ఆవిర్భావ వేడుకల్లో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ నుంచి బహిష్కృతులైన ద్రోహులను ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకునే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అదే సమయంలో ఓపీఎస్, ఆయన మద్దతుదారులు ఎలాగైనా పార్టీలో చేరి కలిసికట్టుగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సమయంలో అన్నాడీఎంకే సీనియర్ నేతలతో రహస్యంగా మంతనాలు ప్రారంభించారు. ఓపీఎస్‌కు కుడిభుజంగా వ్యవహరిస్తున్న మాజీ మంత్రి వైద్యలింగం ఇటీవల మాట్లాడుతూ... 2025లో అన్ని వర్గాలు ఏకమైన అన్నాడీఎంకే తెరపైకి రావడం ఖాయమన్నారు. తమ నేత ఓపీఎస్ మళ్లీ చక్రం తిప్పుతాడని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా 2026 ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారంలోకి వస్తుందని, అదే సమయంలో ఓపీఎస్ వర్గీయులందరికీ పూర్వవైభవం ఖాయమంటూ ధీమా వ్యక్తం చేశారు. ఈపీఎస్ వర్గానికి చెందిన నాయకులంతా వైద్యలింగం ప్రకటనపై భగ్గున మండిపడ్డారు. అన్నాడీఎంకేలో చీలికలంటూ ఏవీ లేవని, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఒకరిద్దరు నాయకులు అన్నాడీఎంకేలో త్వరలో విలీనం జరుగుతుందని చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ, ఓపీఎస్, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధినేత టీటీవీ దినకరన్ ఏకమై వచ్చినా పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

బీజేపీ మద్దతు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నుంచి విడిపోయినవారినంతా ఏకతాటిపైకి తీసుకురావాలని బీజేపీ జాతీయ నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు. తమ ప్రయత్నాలకు అండగా ఓపీఎస్ ఉంటారనే భావనతోనే ఆయనకు బీజేపీ నేతలు ప్రతి విషయంలో అగ్రతాంబూలం ఇస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓపీఎస్‌ని ఎంపీ చేయాలనుకున్న బీజేపీ నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇదే తరహాలో అసెంబ్లీ ఎన్నికల్లో తమకు చేదు అనుభవం ఎదురవుతుందేమోనని ఓపీఎస్ వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటికీ తోడు ఓపీఎస్ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇటీవల ఢిల్లీ వెళ్ళిన ఓపీఎస్ బీజేపీ సీనియర్ నేతలను కలుసుకుని అన్నాడీఎంకే నుంచి విడిపోయినవారిని కలిపేందుకు చర్యలు ప్రారంభించాలని కోరినట్టు సమాచారం. జాతీయ నాయకులతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్న ఓపీఎస్ సొంతంగా పార్టీని ప్రారంభించలేకున్నారు. అదే సమయంలో నటుడు శరత్‌కుమార్‌లా అనుచరగణంతో బీజేపీలో చేరేందుకూ తటపటాయిస్తున్నారు. ఇటు పార్టీని ప్రారంభించక, అటు ఏ పార్టీ పంచన చేరాలో తెలియక ఓపీఎస్, ఆయన వర్గీయులు దారీ గమ్యం తెలియక కొట్టుమిట్టాడుతున్నారు.



వెలుగు బాట పయనం కోసం మరో 80 ఆర్డినరీ బస్సులు

- మంత్రి శివశంకర్

ప్యారీస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వెలుగు బాట పయనం కోసం మరో 80 ఆర్డినరీ బస్సులు నడుపుతున్నట్లు ప్రభుత్వ రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రవాణా శాఖ చేపట్టిన చర్యల మేరకు 3 వేల కొత్త బస్సులు కొనుగోలు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇందులో ఇప్పటికే మిగతా రవాణా సంస్థల ద్వారా పలు జిల్లాల్లో 162 కొత్త బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. 2022 నుంచి ఇప్పటివరకు 1,905 కొత్త బస్సులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. పాడైన బస్సులకు మరమ్మతులు చేపట్టామని, వీటిలో ప్రస్తుతం 1,268 బస్సులు గ్రామీణ ప్రాంతాల్లో నడుపుతున్నామన్నారు. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో జర్మన్ అభివృద్ధి బ్యాంక్ నిధుల సహకారంతో ఇప్పటికే దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు అనుకూలంగా 228 లో ఫ్లోర్ బస్సులు అందుబాటులో ఉండగా అదనంగా 41 బస్సులు ఇటీవల ప్రారంభించామన్నారు. రాజధాని నగర ప్రయాణికుల సౌకర్యార్థం మరో 80 కొత్త లో ఫ్లోర్ బస్సులు పరిచయం చేసినట్లు మంత్రి తెలిపారు.

కాశిమేడు చేపల రేవుకు పోటెత్తిన నగరవాసులు



కాశిమేడు వద్ద చేపల కొనుగోలుకు గుమికూడిన నగరవాసులు

చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి పూజలకు అత్యంత శ్రేష్ఠదాయకమైన తమిళ మాసం పురటాసి గత శుక్రవారం ముగిసింది. ఈ మాసంలో శ్రీవారి భక్తులంతా శాకాహారానికే పరిమితమై ఆ మాసంలో వచ్చే శనివారాల్లో వ్రతమాచరిస్తారు. ఈ కారణంగా నెల రోజుల పాటు కాశిమేడు చేపల రేవులో విక్రయాలు మందగించాయి. ఈక్రమంలో పురటాసి ముగియడంతో ఆదివారం ఒక్కసారిగా అమ్మకాలు ఊపందుకున్నాయి. నగరవాసులు వేకువజామునే కాశిమేడుకు బైకులు, కార్లలో, షేర్ ఆటోల్లో చేరుకున్నారు. స్థానిక జాలర్లు కూడా విక్రయాలు అధికంగా ఉంటాయని ముందుగానే ఊహించి వంద మరపడవల్లో పట్టుకొచ్చిన వివిధ రకాల చేపలను ఆ మార్కెట్‌లో పెద్ద పెద్ద బుట్టల్లో, ప్లాస్టిక్ ట్రేలలో ఉంచి వాటిని విక్రయించారు. ఆ తాజా చేపలను టోకుగా కొనేందుకు నగరవాసులు పోటీపడ్డారు. చేపలకు ఉన్నట్టుండి డిమాండ్ పెరగటంతో వాటి ధరలు కూడా పెరిగాయి. ఆ మేరకు మేలు రకం వంజరం చేపలు కిలో రూ.900 వరకు విక్రయించారు. పెద్ద పీతలు కిలో రూ.200ల నుంచి రూ.400లకు పెరిగింది. ఇదే విధంగా శంకరా, ఇరాల్, వవ్వాల్, కడమా చేపల ధరలు కూడా పెరిగాయి. చేపల ధరలు రెట్టింపుకు పైగా పెరిగినా నగరవాసులు పట్టించుకోకుండా బుట్టలకొద్దీ కొనుగోలు చేసి ఇళ్లకు పయనమయ్యారు. ఆదివారం వేకువజాము నాలుగు గంటలకు ప్రారంభమైన చేపల విక్రయాలు ఉదయం ఏడున్నర గంటలకల్లా ముగిశాయి. ఆ తర్వాత వచ్చిన నగరవాసులంతా చేపలవేట సాగించి తాజా చేపలతో రానున్న మరపడవ జాలర్ల కోసం గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. ఆదివారం కాశిమేడులో కిలో వవ్వాల్ రకం రూ.550, శంకరా రూ.250లు, షీలారూ.350, ఇరాల్ చేపలు రూ.300, కడమా చేపలు రూ.250కు విక్రయించారు.

నోటుకు ఓటు అమ్ముడయ్యే దుస్థితి పోవాలి

- డీఎండీకే నేత విజయ ప్రభాకరన్



చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నోటుకు ఓటు అమ్ముడయ్యే దుస్థితి పోవాలని, అప్పుడే ప్రజలకు సుపరిపాలన లభిస్తుందని డీఎండీకే నేత విజయ ప్రభాకరన్ అన్నారు. ఈరోడ్ జిల్లా అందియూరు రథం వీధిలో ఏర్పాటైన పార్టీ వేడుకల సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ ఈరోడ్ జిల్లాల్లోనే రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటన జారీ చేశారని, ఆ సందర్భంగా ధనమిచ్చేవారికి ఓటు వేయొద్దు అంటూ పిలుపిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విజయకాంత్ రాష్ట్రాన్ని ఎన్నడూ విడువలేదని, రాష్ట్రమే విజయకాంత్‌ని విడిచిపెట్టిందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి తన మాతృమూర్తి ప్రేమలతలా చెబుతున్నట్లు రాష్ట్రంలో పార్టీలు మారినా ప్రజల తలరాతలు మారవని ఆయన చెప్పారు. 2005లో విజయకాంత్ మదురైలో పార్టీ మహానాడును తమ భూములను విక్రయించి ఆ సొమ్ముతో జరిపినట్లు చెప్పారు. విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల్లో తాను ఎంత స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయాననే విషయం ప్రజలందరకీ తెలుసునని, తమ పార్టీకి ద్రోహం చేసిన వారెవరైనా వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్రంలో హిందీని నేర్చుకోవాలని ఒక పార్టీ, ఆ భాషను నేర్చుకోకూడదని మరో పార్టీ చెబుతోందని, ప్రజలు ఏ పార్టీ మాట వినాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. అందరూ తమకు నచ్చిన భాషలు నేర్చుకోవాలన్నదే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. తనకు ఎమ్మెల్యే కావాలనే ఆశలేదని, పార్టీ పదవిలో ఉంటూనే ప్రజలకు సేవలు చేయగలనని చెప్పారు.

సమాచార దృష్టి

ఉపాధ్యాయులకు 'బయోమెట్రిక్' అటెండెన్స్

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ ద్వారా ఉపాధ్యాయుల అటెండెన్స్ నమోదు మళ్లీ ప్రారంభం కానుంది. ఉపాధ్యాయుల బయోమెట్రిక్ ప్రక్రియను కరోనా కారణంగా నిలిపివేశారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు వచ్చినా పాఠశాలల్లో బయోమెట్రిక్ ప్రక్రియ ప్రారంభించలేదు. ఈ క్రమంలో, దీపావళి సెలవులు ముగిసిన అనంతరం బయోమెట్రిక్ నమోదు మళ్లీ ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టరేట్ జిల్లా విద్యా కార్యాలయాలకు పంపిన సర్క్యులర్‌లో... బయోమెట్రిక్ ప్రక్రియ ప్రారంభించిన పాఠశాలలు, ఆ పరికరాలు పనితీరు, కొత్తగా పనిలో చేరిన ఉపాధ్యాయుల వివరాలు తదితర వివరాలు సేకరించి పంపించాలని ఆదేశించింది.

1న గ్రామసభలు

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల దినోత్సవం నవంబరు 1వ తేది ఉదయం 11 గంటలకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ పొన్నయ్యన్ చెన్నై మినహా అన్ని జిల్లాలకు జారీ చేసిన ఉత్తర్వుల్లో, అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యలు, కాలువల్లో పూడికతీత, అవసరమైన ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవడం, పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలన్నారు. గ్రామసభ నిర్వహణ ప్రాంతం, సమయాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని పేర్కొన్నారు.

యూత్ వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యూత్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు వేలూరు వీఐటీలో నవంబరు 2 నుంచి 5వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే చెన్నై జిల్లాకు చెందిన పురుషులు, మహిళల జట్ల క్రీడాకారుల ఎంపిక ఈ నెల 27వ తేది స్థానిక ఎగ్మూర్ రాధాకృష్ణన్ స్టేడియంలో జరగనుంది. 2002 జనవరి 1 తర్వాత పుట్టిన వారు మాత్రమే పాల్గొనాలి. మరిన్ని వివరాలకు నెం.944484 2628, 9841816778లలో సంప్రదించవచ్చు.

జైన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఎండీ జైన్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ డాక్టర్ తంగ మారియప్పన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ లెక్చరర్ డాక్టర్ శరణ్య, వేలూరు వీఐటీ టెక్నాలజీ సెక్రటరీ శ్రీ రాజేష్‌కుమార్ జైన్, పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25న ఎస్‌ఎంసీ సమావేశం

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) సమావేశాలు ఈనెల 25వ తేది మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు జరగనున్నట్టు విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది.ఈకమిటీలో కొత్తగా ఎంపికైన సభ్యులకు గుర్తింపుకార్డులు అందించడం, ఎస్‌ఎంసీ సభ్యులతో కూడిన వాట్సాప్ గ్రూపును ప్రధానోపాధ్యాయులు ఏర్పాటు చేయాలని పేర్కొంది. విద్యాబోధన, పాఠశాలల్లో మౌలిక వసతులు తదితరాలపై చర్చించి, తీసుకున్న నిర్ణయాలను పంపించాలనింది.

'మతి దీపావళి గిఫ్ట్ బాక్స్' సిద్ధం

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా వివిధ మిఠాయిలతో 'మతి దీపావళి గిఫ్ట్ బాక్స్' విక్రయానికి సిద్ధం చేశారు. రెడ్ రైస్ లడ్డూ, డ్రైఫ్రూట్ లడ్డూ, ఆవరంపూ లడ్డూ, స్పైసీ లడ్డూ, మురుకులు, కొబ్బరిపాల దుల్కులు, బియ్యం మురుకులు, తంజావూరు తోలు బొమ్మలు ఈ నెల 23వ తేది వరకు విక్రయించనున్నారు. నెం.7603899270లో సంప్రదించి గిఫ్ట్ బాక్స్ కొనుగోలు చేయవచ్చు. అలాగే, వళ్లువర్ కోట్టం సమీపంలోని 'మతి అనుభవ్ దుకాణా'నంలో ఈ గిఫ్ట్ బాక్స్‌లు కొనుగోలు చేయవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

మేట్టూరుకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరుకు నీటిరాక తగ్గింది.శనివారం ఉదయం డ్యాంలోకి సెకనుకు 18,384ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, ఆదివారం ఉదయం 15,929 ఘనపుటడుగులకు తగ్గింది. డెల్టా జిల్లాల సాగుకు విడుదల చేస్తున్న 500 ఘనపుటడుగుల నీటిని 3,000 ఘనపుటడుగులకు పెంచారు. ప్రస్తుతం డ్యాంలో 96.90 అడుగులు (60.89 టీఎంసీలు) నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నీలవేము కషాయం పంపిణీ

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డెంగ్యూ, మలేరియా తదితర జ్వరాలు ప్రబలే అవకాశముందని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ జ్వరాల ముందస్తు చర్యల్లో భాగంగా నీలవేము కషాయం పంపిణీ చేయాలని జిల్లా ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం ఆనైకట్టు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నీలవేము కషాయం పంపిణీ చేసేలా ఏర్పాటుచేసిన ఆటోను ఎమ్మెల్యే నందకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధ్యక్షుడు బాబు, వేలూరు యూనియన్ సెక్రటరీ జ్ఞానశేఖరన్, ఆనైకట్టు యూనియన్ సెక్రటరీ కుమారపాండ్యన్, కనియంబాడి యూనియన్ సెక్రటరీ గజేంద్రన్, ప్రాంత సెక్రటరీలు తంగదొరై, అయ్యప్పన్, అరుళ్‌నాథన్ తదితరులు పాల్గొన్నారు.

తిరువేర్కాడు చెరువు స్థలంలో

ఇళ్ల తొలగింపు

స్థానికుల రాస్తారోకో

చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువేర్కాడు ప్రాంతంలో కోలడిచెరువు స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించుకున్న ఇళ్లను ఎక్స్‌కవేటర్లతో కూల్చేపనులను పూందమల్లి రెవెన్యూశాఖ అధికారులు ప్రారంభించారు. ఇలా ఆకస్మికంగా తమ భవనాలు, ఇళ్లను కూల్చివేయడాన్ని ఖండిస్తూ స్థానికులు ఇళ్ల యజమానులు రాస్తారోకోకు దిగారు. ప్రస్తుతం ఆ చెరువు స్థలంలో 50కి పైగా భవనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. చెరువు స్థలంలో నిర్మించుకున్న ఆ ఇళ్లలోని వారిని ఖాళీ చేయాల్సిందిగా కొద్ది మాసాలకు ముందే రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం భవనాల కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం మళ్లీ రెవెన్యూ అధికారులు పోలీసుల భద్రత నడుమ ఆ ప్రాంతంలో యంత్రాలతో ఆక్రమిత కట్టడాలను తొలగించేందుకు ప్రయత్నించారు. సుమారు 500 మంది కూల్చివేతలను అడ్డుకున్నారు.



తిరువేర్కాడు కొలడి చెరువు ప్రాంతం వద్ద రాస్తారోకో జరుపుతున్న స్థానికులు

సంతానోత్పత్తి కోసం విమానంలో

అండమాన్‌కు స్టోన్ క్రాబ్



చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపంలోని కోడియక్కరై సముద్రతీరంలో జాలర్లు విసిరిన ఓ వలలో సుమారు మూడు కిలోల బరువున్న స్టోన్ క్రాబ్ (రాతి పీత) చిక్కింది. జాలర్లు ఆ పీతను తీసుకొచ్చి పరిశీలించినప్పుడు దానివెనుక వైపు లక్షల సంఖ్యలో గుడ్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే జాలర్లు ఆ పీతను నిండుగా మంచినీళ్లున్న ప్లాస్టిక్ తొట్టిలో భద్రపరిచారు. ఆ తర్వాత ఆ పీత గుడ్లు పొదగటానికి అండమాన్ సముద్రతీరమే అనువైనదని భావించారు. ఈ నేపథ్యంలో ఆ పీతను విమానంలో అండమాన్‌కు తరలించే ఏర్పాట్లు చేపట్టారు.

శరవణరాజ్‌కు 'తిరుప్పూర్ కుమరన్' పురస్కారం



పురస్కారం అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ప్రజా సమితి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి పురస్కారాల ప్రదానం శనివారం సాయంత్రం చెన్నైలో జరిగింది. వ్యాపార రంగం లో రాణిస్తున్న పమ్మల్‌కు చెందిన పారిశ్రామికవేత్త లయన్ పీఆర్‌ఎస్ శరవణరాజ్‌కు 'తిరుప్పూర్ కుమరన్' పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు మన విల్సన్, కరుప్పుస్వామి, ఇరవి, ఇనియవన్ జాన్, భారత్‌రాజా, సామి, గోపి దేవ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18 నెలల్లోమదురై ఎయిమ్స్ పనులు పూర్తి

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మదురై ఎయిమ్స్ వైద్య కళాశాల ఆసుపత్రి తొలి విడత నిర్మాణాలు 18 నెలల్లో పూర్తవుతాయని మదురై ఎయిమ్స్ నిర్వహణ డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. మదురై తోపూరులో 221 ఎకరాలల్లో 2023 ఆగస్టులో 17న ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణం కోసం టెండర్లు ఆహ్వానించగా, ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది. 2024 మే 10వ తేది పర్యావరణ అనుమతులు రావడంతో, 20వ తేది నుంచి పనులు ప్రారంభించింది. రూ.2,021 కోట్ల తో చేపట్టనున్న ఈ పనుల్లో తొలివిడతగా వైద్య కళాశాల, అత్యవసర చికిత్సా విభాగం, అవుట్, ఇన్ పేషంట్ల వార్డులు, విద్యార్థుల వసతి గృహ నిర్మాణాలు 18 నెలల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

నటరాజ స్వామిని దర్శించుకున్న సీజే



సీజే కేఏ శ్రీరామ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ దీక్షితులు


పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిదంబరం నటరాజస్వామి ఆలయాన్ని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ కుటుంసభ్యులతో వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయానికి వెళ్లిన ప్రధాన న్యాయమూర్తి ఆలయ దీక్షితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కనక సభ నుంచి శివగామిసుందరి సమేత నటరాజస్వామిని సీజే దర్శనం చేసుకున్నారు. తొలుత తిల్లై కాళియమ్మన్ ఆలయానికి వెళ్లిన సీజే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రాహుకాలంలో శ్రీవారి కల్యాణం

● 9 మంది భట్టాచార్యులకు మెమో

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాహుకాలంలో శ్రీవారి కల్యాణం నిర్వహించిన భట్టాచార్యులకు హిందూ దేవాదాయ శాఖ మెమో జారీ చేసింది. సేలం జిల్లా కడయాంపట్టి కారువల్లిలో వెంకటరమణ ఆలయం ఉంది. హిందూ దేవాదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయంలో పురటాసి వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామివారి తిరుకల్యాణం జరిగింది. ఆలయ ప్రధాన భట్టాచార్యులు రామ భట్టాచార్యుల నేతృత్వంలో, భక్తుల సమక్షంలో స్వామివారి కల్యాణ ఘట్టం ప్రారంభించారు. శుభ ముహూర్తం ఉదయం 9 నుంచి 10.30 గంటల్లోపు స్వామివారి మంగళసూత్ర ధారణ చేయాల్సి ఉండగా, 11.30 గంటలకు రాహు కాలంలో మంగళసూత్రం కట్టినట్లు సమాచారం. ఈ వేడుకలు స్థానిక కేబుల్ ఛానల్‌లో ప్రసారం చేశారు. ఆగమశాస్త్రానికి విరుద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారని భక్తులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు, కల్యాణోత్సవం జరిపించిన 9 మంది భట్టాచార్యులకు మెమో జారీచేశారు.

విద్యార్థులకు ఏఆర్‌ఎస్ గ్రూపు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ-సీఎస్ఆర్)లో భాగంగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి, టెన్త్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కొందరు విద్యార్థులను ఏఆర్‌ఎస్ గ్రూపు సన్మానించింది. అన్నానగర్‌లోని ఏఆర్‌ఎస్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టాప్-3 విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కంపెనీ ఫ్యాక్టరీలు ఉన్న పరిసర ప్రాంతాలైన సిద్ధరాజ కండ్రిక, ఎగువరపాళెయం, మాదర్‌పాక్కంలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రివార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసింది. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్, డైరెక్టర్ రాజేష్ భాటియా, టెక్నికల్ డైరెక్టర్ సత్యనారాయణ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ శేఖర్, సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభు, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ మీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీసీసీకి రహదారి పర్యవేక్షణ

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి, పెరుంగుడి ఫ్లై ఓవర్ స్టేషన్లు కలిపే రహదారి నిర్వహణ పనులు చేపట్టేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కి అప్పగిస్తూ దక్షిణ రైల్వే అనుమతులు జారీ చేసింది. సుమారు 2 కి.మీ పొడవైన ఈ రహదారిపై ఫుట్ పాత్, సీట్లు, నీటి రిజర్వాయర్లు నిర్మించే యోచనలో ఉన్నట్లు జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ తెలిపారు.

టీవీకే జెండా వ్యవహారం...

విజయ్‌కు బీఎస్పీ నోటీసు

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల్లో పార్టీ జెండాలో ఏనుగుల చిత్రాలు తొలగించని పక్షంలో చట్టరీత్యా చర్యలు చేపడతామని నటుడు విజయ్‌కు బీఎస్పీ నోటీసు జారీ చేసింది. నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాను ఎరుపు, పసుపు రంగుల్లో రూపొందించారు. అలాగే, విజయానికి ప్రతీకగా రెండు ఏనుగు బొమ్మలు ఉన్నాయి. తమ పార్టీ పతాక చిహ్నమైన ఏనుగును టీవీకే వినియోగించడం తగదని, వెంటనే ఏనుగు బొమ్మలు తీసివేయాలని బీఎస్పీ తరపున న్యాయవాది టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు నోటీసు పంపారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో డీఎంకే విఫలం

● బీజేపీ నేత హెచ్.రాజా



సమావేశంలో మాట్లాడుతున్న రాజా

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త హెచ్.రాజా విమర్శించారు. జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర సెక్రటరీ కాత్యాయని అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హెచ్.రాజా మీడియా సమావేశంలో మాట్లాడుతూ... డీడీ తమిళం టీవీ కార్యక్రమంలో తమిళ తాయ్ ప్రార్థనలో ఒక పంక్తి వదిలేశారని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. కానీ, అలాంటి చర్యలు చేపట్టని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నర్ రవిని తప్పుపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హిందూ సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నీట్ శిక్షణ కేంద్రంలో బడిత పూజలు

మాజీ ఉద్యోగులు, విద్యార్థులకు సమన్ల జారీ

చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలోని ప్రైవేటు నీట్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులను బెత్తంతో బాదటం, విద్యార్థినులపై చెప్పులు విసిరవేయడం తదితర సంఘటనలపై ఆ నగర పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కేరళకు చెందిన జమాలుద్దీన్ అహమ్మద్ నడుపుతున్న నీట్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులను టీచర్ బెత్తంతో చితక బాదడం, మరో అధ్యాపకుడు కునుకు తీసిన విద్యార్థినిపై చెప్పులు విసిరివేయడం వంటి సంఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ సంఘటనపై స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం సభ్యుడు జస్టిస్ కన్నదాసన్ ఆ శిక్షణ కేంద్రం వద్ద విచారణ జరిపారు. అదే సమయంలో ఆ కేంద్రం నిర్వాహకుడు జలాలుద్దీన్ అహమ్మద్ పారిపోయాడు. ఇక తిరునల్వేలి నగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఆ కేంద్రం మాజీ విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ రూపేష్‌కుమార్ సమన్లు జారీ చేశారు. వీరందరినీ వేర్వేరుగా విచారించనున్నట్లు ఆయన తెలిపారు.

అన్నాడీఎంకే అనుబంధ సంఘాల సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే పరమశివం

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అనుబంధ యువజన, మహిళా విభాగాల జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. స్థానిక అన్నాడీఎంకే కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా పాసరై సెక్రటరీ రంజిత్ కుమార్, మా నగర జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు పాల్గొన్నారు. సమావేశంలో యువజన విభాగం సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే పరమశివం పాల్గొని, సూచనలు, సలహాలు అందించారు.

శ్రీ అన్నపూర్ణి నిత్య అన్నదాన ట్రస్ట్ మొదటి వార్షికోత్సవం

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరి చావడి వీధిలోని శ్రీ అన్నపూర్ణి నిత్య అన్నదాన ట్రస్ట్ మొదటి వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి, కలవై సచ్చిదానంద స్వామి, కన్నియమ్మన్ స్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గో పూజ, మహా గణపతి హోమం, మహా దీపారాధన, వస్త్ర దానం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు సెల్వరాజ్, సెక్రటరీ భరత్, కోశాధికారి మోహన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు విక్రయం

భార్యాభర్తల అరెస్టు

అడయార్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలో మత్తుపదార్థాలను విక్రయించిన భార్యాభర్తలను నగర పోలీసులు అరెస్టు చేశారు. అరుంబాక్కంతో పాటు పరిసర ప్రాంతాల్లో మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దీంతో ఓ మహిళను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, మత్తుపదార్థాలు ఉన్నట్టు గుర్తించారు. విచారణలో ఆమె వెల్లడించిన వివరాల మేరకు మాధవరానికి చెందిన దీపక్, డాలీ అనే దంపతులను అరెస్టు చేశారు. వీరిద్దరు వ్యాసర్పాడికి చెందిన ముత్తుకుమార్ వద్ద మత్తుపదార్థాలను కొనుగోలు చేసి నగర శివార ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

బాలికపై లైంగిక వేధింపులు

మ్యూజిక్ టీచర్ అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన మ్యూజిక్ టీచర్ కటకటాలపాలయ్యాడు. కొద్దిరోజుల క్రితం నగరంలో కురిసిన భారీవర్షాల కారణంగా ఈ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి నీరు ప్రవేశించింది. దీంతో, కింది అంతస్తులో నివసిస్తున్న వారు మేడపై ఉన్న ఇంటికి వెళ్లారు. అక్కడ ఇంటిని శుభ్రం చేస్తున్న సమయంలో పక్కనే నివసిస్తున్న మ్యూజిక్ టీచర్ ఇంట్లో ఉన్న 11 ఏళ్ల బాలికను తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. అనంతరం ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మ్యూజిక్ టీచర్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

కవరింగ్ నగలతో రూ.2 కోట్ల మోసం

● నలుగురి అరెస్టు

అడయార్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శివగంగై జిల్లా కారైక్కుడిలోని ఒక ప్రైవేటు బ్యాంకులో కవరింగ్ నగలను కుదువపెట్టి రూ.2 కోట్ల మేర మోసం చేసిన కేసులో నలుగురిని జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఆ బ్యాంకు జోనల్ మేనేజర్ కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి బ్యాంకు మేనేజర్ విఘ్నేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజాత్తి, మోసానికి సహకరించిన రమేష్, సతీష్‌ని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

కన్నియాకుమారిలో పర్యాటకుల సందడి

ప్యారీస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం కన్నియాకుమారికి పర్యాటకులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. వారాంతపు సెలవులతో స్వదేశీ, విదేశీ పర్యాటకులతో ఈ ప్రాంతం కళకళలాడింది. త్రివేణి సంగమం సంగిలి సముద్రతీరంలో సూర్యోదయం దృశ్యాన్ని వీక్షించేందుకు తెల్లవారుజాము నుంచే పర్యాటకులు పుష్కర ఘాట్ మెట్లపై గుమిగూడారు. అనంతరం సముద్రంలో ఉత్సాహంగా స్నానమాచరించారు. ఇటీవల సముద్రంలో ఏర్పడిన మార్పుల కారణంగా కొన్నిరోజులుగా వివేకానంద స్మారక మండపానికి ఉదయం 8 గంటలకు పడవ సవారీ ప్రారంభించలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం ప్రారంభం కావడంతో పర్యాటకుల క్యూలైన్లలో బారులుతీరి వివేకానంద మండపాన్ని సందర్శించారు. అదే విధంగా గాంధీ స్మారక మండపం, కామరాజర్ మణిమండపం, సునామీ స్మారక పార్క్, మ్యూజియం, ప్రభుత్వ పండ్ల గార్డెన్, లైట్ హౌస్, సన్‌సెట్ పాయింట్, వివేకానందపురంలో ఉన్న భారతమాత ఆలయం, రామాయణ దర్శన చిత్తిరై ప్రదర్శన, స్వాతంత్ర్య సమరయోధుల స్మారక ప్రహరి, అక్వేరియం, వట్టకోట బీచ్, కోవలం బీచ్ తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. అలాగే, కన్నియాకుమారిలో పురాతన భగవతి అమ్మవారి ఆలయం, తిరుపతి వెంకటాచలపతి ఆలయం, సుశీంద్రం దానుమాలియా ఆలయం తదితర ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.



పుష్కర ఘాట్ మెట్లపై పర్యాటకులు

కొడియకరైలో విదేశీ విహంగాల సందడి



పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా వేదారణ్యం సమీపం కొడియకరై పక్షుల శరణాలయానికి విదేశీ విహంగాల రాక ప్రారంభమైంది. గూడ కొంగలు, పెద్ద ముక్కు కొంగలు, నల్ల బాతులు, పెద్ద కాళ్ల కొంగలు అని పలురకాల పక్షులు ఈ ప్రాంతంలోని జలాశయాల్లో ఆహారం కోసం చేపలను వేటాడుతూ సందడి చేస్తున్నాయి. అక్టోబరు నుంచి మార్చి వరకు రష్యా, ఇరాన్, ఇరాక్, శ్రీలంక, సైబీరియా సహా పలు దేశాల నుంచి సంతానోత్పత్తి కోసం సుమారు 290 రకాల విదేశీ పక్షులు ఈ ప్రాంతానికి వస్తుంటాయని పక్షి ప్రేమికులు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్



పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాద రహిత పండుగను జరుపుకొనేలా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది దీపావళి పండుగను ఈనెల 31వ తేది ప్రజలు జరుపుకోనున్నారు. పండుగ రోజున టపాసులు కాల్చేందుకు పిల్లలు సహా ఇంటిల్లిపాది ఆసక్తి చూపుతుంటారు. అదే సమయంలో బాణసంచా కారణంగా హఠాత్తుగా మంటలు చెలరేగి పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రమాద రహిత దీపావళిని జరుపుకొనేలా అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కడలూరు జిల్లా విరుదాచలం బస్టాండ్‌లో అగ్నిమాపక సిబ్బంది, మంటలు ఆర్పడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్సలు తదితరాలను చేసి చూపారు.

నీటమునిగి ముగ్గురి మృతి



మృతులు శ్రీపతి, శివరుందని

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు సమీపంలోని చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు నీటమునిగి మృతిచెందారు. సేలం జిల్లా మేట్టూరు సమీపం నాగవల్లి వీరక్కల్ ప్రాంతానికి చెందిన కుమార్తె శివరుందని (20), కుమారుడు శ్రీపతి (10), జీవదర్శిని (14) ఆదివారం ఉదయం ఆ ప్రాంతంలోని కుట్టై చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. ముందుగా స్నానాలకు చేయబోయిన ముగ్గురు లోతైన ప్రాంతానికి వెళ్లి ఒకరి తర్వాత ఒకరు మృతిచెందారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని రెండు గంటలు గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై నంగవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరు కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్


వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ మదివానన్ ఉత్తర్వులతో కాట్పాడి ఇన్‌స్పెక్టర్ ఆనందన్, ఎస్ఐ మణికంఠన్ నేతృత్వంలో పోలీసులు ఆదివారం ఉదయం కాట్పాడి రైల్వే బస్టాండ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసులను చూసి ఇద్దరు యువకులు పరారు కాగా, మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగు తనిఖీ చేయగా రూ.60 వేల విలువైన 6 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో, తిరుమలైనగర్ ఇడువంపాళ్యం తిరుప్పూర్‌కు చెందిన తనిగైవేలన్ (32) అని, ఆంధ్రా నుంచి గంజాయిని తిరుప్పూర్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. అతన్నికోర్టులో హాజరుపరచి జైలుకు తరలించిన పోలీసులు, పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

టపాసులు కాల్చడానికి ఉదయం, సాయంత్రం చెరో రెండు గంటలే



పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రెండు గంటలు మాత్రమే టపాసులు కాల్చాలని తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. దీపావళి పండుగను ఈనెల 31న ప్రజలు జరుపుకోనున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడేది టపాసులు కాల్చడం. కొద్ది సంవత్సరాలుగా పర్యవరణ పరిరక్షణ కోసం దీపావళి రోజున టపాసులు కాల్చేందుకు నిర్ణీత సమయం విధిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 31న జరుపుకోనున్న దీపావళి పండుగ సందర్భంగా ఉదయం 6 నుంచి 7 గంటలు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని కాలుష్య నియంత్రణ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. తక్కువ శబ్దం, కాలుష్యం కలిగించని గ్రీన్ టపాసులు మాత్రమే కాల్చాలని విజ్ఞప్తి చేసిన బోర్డు, ప్రార్థనా స్థలాలు, బహిరంగ ప్రాంతాల్లో, ఆస్పత్రులు తదితర ప్రాంతాల్లో టపాసులు కాల్చరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

సైన్స్ ఇయక్కం రాష్ట్రస్థాయి సదస్సు



జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ ఇయక్కం దక్షిణ మండల స్థాయి 'విద్యలో సైన్స్' అంశంపై సదస్సు స్థానిక చెల్లియప్ప భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు అముద అధ్యక్షత వహించగా, జిల్లా సెక్రటరీ జనార్దనన్, విద్యాశాఖ స్పీకర్లు బాలకృష్ణన్, సుబ్రమణ్యన్, విశ్వనాథన్, అంబిక తదితరులు పాల్గొన్నారు. సదస్సులో వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, కృష్ణగిరి, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు, తిరువణ్ణామలై సహా పలు జిల్లాలకు చెందిన 500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సదస్సు ఆర్గనైజర్లు భూపాలన్, మురుగన్, పద్మనాభన్ అతిథులకు జ్ఞాపికలు అందజేశారు.



సినిమాను మాత్రమే ప్రేమిస్తున్నా

తనకు ఇతరులను ప్రేమించే సమయం లేదని, ఇప్పటి వరకు సినిమానే ప్రేమిస్తున్నానని హీరోయిన్ సునైన స్పష్టం చేశారు. 'రెజీనా' సినిమా తర్వాత 'రాకెట్ డ్రైవర్' సినిమాలో నటించిన సునైన.. ఆ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఎదురైన ప్రశ్నకు సునైనా ఘాటుగా సమాధానమిచ్చారు. 'నేను ఎల్లవేళలా సినిమాను మాత్రమే ప్రేమిస్తున్నా. ఎవరిపైనా ప్రేమ లేదు. నాకు ఖాళీ దొరికిన సమయాల్లో వెబ్ సిరీస్‌లు చూడటం ఎంటర్‌టైన్మెంట్‌గా పెట్టుకున్నా. దీంతో అనేక విషయాలను నేర్చుకుంటున్నా' అని అన్నారు. కాగా, ఇటీవల ఆమె ఓ వ్యక్తి చెయ్యి పట్టుకుని 'లాక్' అనే క్యాప్షన్‌తో ఓ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో సునైన ఓ ఇంటి కోడలు కానుందంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి సునైన ఫుల్‌స్టాప్ పెట్టారు.

కృష్ణ హీరోగా నటించే 23వ చిత్రం ప్రారంభం

యువ హీరో కృష్ణ నటించే 23వ చిత్రం ఆదివారంసాలి గ్రామంలోని ప్రసాద్ ల్యాబ్స్‌లో పూజతో ప్రారంభమైంది. డాన్ క్రియేషన్స్ బ్యానరుపై నిర్మించే రెండో చిత్రం. నిర్మాత ఎల్.గణేష్ భారీ బడ్జెట్‌తో నిర్మించేలా ప్లాన్ చేశారు. అప్పాదురై భారతీరాజా ఈ చిత్రం ద్వారా దర్శకుడుగా పరిచయమవుతున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన దర్శకుడు సత్యశివ హీరోహీరోయిన్లపై తొలిక్లాప్ కొట్టి ప్రారంభించారు. వర్ష విశ్వనాథ్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రం ఒక పల్లెటూరి కథతో తెరకెక్కుతోంది. తిరుచ్చి, మదురై తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకోనుంది. సస్పెన్స్, యాక్షన్ భరిత కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నట్టు దర్శకుడు అప్పాదురై భారతీ రాజా చెప్పారు. కాగా, ఈ చిత్రానికి కెమెరా నాగార్జున, సంగీతం శ్యామ్ సీఎస్, ఆర్ట్ డైరెక్టర్ పాపనాడు సి ఉదయకుమార్, ఎడిటర్ వెట్రికృష్ణన్. ఈ పూజా కార్యక్రమంలో పలువురు సినీ సెలెబ్రిటీలు పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.


కొత్త చిత్రం ప్రారంభ పూజా దృశ్యం

ఆర్జే బాలాజీ హీరోగా 'స్వర్గవాసల్'

దర్శక హీరో ఆర్జే బాలాజీ కథానాయకుడిగా 'స్వర్గవాసల్' పేరుతో ఒక చిత్రం రూపొందుతుండగా, ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. 'తంగలాన్' ఫేం పా.రంజిత్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన సిద్ధార్థ్ విశ్వనాథన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈయనతో కలిసి ప్రముఖ రచయిత తమిళప్రభ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చగా, చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో ఆర్జే బాలాజీ రెండు చేతులతో పలక (స్లేట్) పట్టుకుని నిల్చొనివుండగా, అందులో 'సెంట్రల్ జైలు మద్రాస్ 1999' అని రాసివుంది. 90లో జరిగే పీరియాడిక్ జోనర్‌లో జైలు నుంచి తప్పించుకునే ఖైదీ స్టోరీతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ నిర్మాణ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకోవడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగిపోయాయి. కాగా, ఆర్జే బాలాజీ నటించిన 'సింగపూర్ సెలూన్' చిత్రం ఇటీవల విడుదలై విజయం సాధించింది. మరోవైపు, కథానాయకుడిగా రాణిస్తున్న ఆర్జే బాలాజీ.. ఇంకోవైపు హీరో సూర్య నటించే 45వ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారు.


'స్వర్గవాసల్' ఫస్ట్‌లుక్

'సూర్య-44' గ్యాంగ్‌స్టర్ చిత్రం కాదు : కార్తీక్ సుబ్బరాజ్

చిత్రజ్యోతి

సూర్య హీరోగా తాను తెరకెక్కించే 'సూర్య-44' (వర్కింగ్ టైటిల్) మూవీ ఒక గ్యాంగ్‌స్టర్ స్టోరీ కాదని ఆ చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ స్పష్టం చేశారు. ఇది పూర్తిగా యాక్షన్‌భరిత ప్రేమకథా చిత్రమని తెలిపారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్, స్టోన్‌బెంచ్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్. జోజు జార్జి, కరుణాకరన్ ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. చిత్రీకరణ పనులను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేసేలా ప్లాన్ చేసి, పూర్తి చేశారు కూడా. ఈ నేపథ్యంలో ఇది ఒక గ్యాంగ్‌స్టర్ స్టోరీ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా దీనిపై కార్తీక్ సుబ్బరాజ్ స్పందించారు. 'నేను ఒక ప్రాజెక్టును అనౌన్స్ చేస్తేనే గ్యాంగ్‌స్టర్ మూవీగా డిసైడ్ చేస్తున్నారు. కానీ, 'సూర్య-44' ఆ తరహా చిత్రం కాదు. యాక్షన్ భరిత లవ్‌స్టోరీ. చాలాకాలంగా లవ్‌స్టోరీ చేయాలని అనుకుంటున్నాను. ఇపుడు సూర్య - పూజా హెగ్డేతో కలిసి ఆ తరహా ప్రాజెక్టు చేయడం చాలా సంతోషంగా ఉంది. 'జిగర్‌తండా డబుల్ ఎక్స్' కంటే ముందు ఈ స్టోరీని సూర్యకు వినిపించాను. ఇందులోని ప్రతి సన్నివేశం గురించి చాలా డిటైల్డ్‌గా అడిగారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేశాం. వేసవి సెలవుల్లో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం. అయితే, రిలీజ్ డేట్‌పై ఇంకా క్లారిటీ లేదు' అని చెప్పారు.



ఈశాన్య రుతుపవనాల ఎఫెక్ట్:

జలకళను సంతరించుకున్న చెరువులు, కొలనులు

అంబత్తూరు జోన్‌లో వర్షాలకు నీటితో నిండిన వైరకుళం






చోళింగనల్లూరు మెజెస్టిక్ లేఅవుట్ చెరువు

చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావిత వర్షాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పవాయుపీడనం వల్ల కురిసిన భారీ వర్షాలకు చెన్నై నగర పరిధిలోని చెరువులు, ఆలయ కొలనులు జల కళ సంతరించుకున్నాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో వాననీటిని సేకరించే విధంగా ఉద్యానవనాలు, చెరువులు, వాగుల మరమ్మతు లను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలోని చిన్న చెరువులన్నీ నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. వీటిలో తిరువొత్తియూరు జోన్‌లోని తామరై చెరువు, మనలిజోన్‌లోని అండార్‌కుప్పం చెరువు, అండార్‌కుప్పం శ్మశాన చెరువు, కుళక్కరై చెరువు, కన్నియమ్మన్‌పేట్టై చెరువు, కామరాజర్‌పురం చెరువు, వడపెరుంబాక్కం చెరువు, వినాయకపురం శ్మశాన చెరువు, అడయార్‌జోన్ మరుదీశ్వరర్ ఆలయ కొలను, తేనాంపేట జోన్ అగస్తీశ్వరాలయ కొలను, అంబత్తూరు జోన్ శివావిష్ణు కొలను సహా 59 చిన్న చెరువులు, ఆలయాల కొలనులు వాననీటితో నిండిపోయాయని కార్పొరేషన్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. చోళింగనల్లూరు జోన్ కన్నగినగర్ చెరువు, మెజెస్టిక్ లేఅవుట్ చెరువులు కూడా వాననీటితో పూర్తిస్థాయిలో నిండాయి. ఈ చెరువులు, ఆలయాల కొలనుల్లోకి వాననీటిని మళ్లించడం ద్వారా నగరంలో పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, వీధుల్లో వరదలా ప్రవహించిన నీరంతా అరగంటలోగా తొలగించగలిగినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ చెరువులు, కొలనులలో నిండుగా జలాలు ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల మట్టం కూడా పెరిగే అవకాశాలున్నాయి.

ఈశాన్య రుతుపవనాలతో 65 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవన వర్షాల కారణంగా సాధారణం కన్నా 65 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెల 1 నుంచి ఆదివారం ఉదయం వరకు 95 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 156.7 మి.మీ వర్షం నమోదైంది. చెన్నైలో ఈశాన్య రుతుపవనాలతో ఆదివారం ఉదయం వరకు 177 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ నెల 1 నుంచి ఆదివారం ఉదయం వరకు సాధారణ వర్షపాతం 122.4 మి.మీ కాగా 338.6 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.


జలకళను సంతరించుకున్న గంగైయమ్మన్ ఆలయ కొలను


మీనంబేడు తాంగళ్‌కుళం


నీటితో కళకళలాడుతున్న చోళింగనల్లూరు జోన్‌లో పునర్నిర్మించిన కన్నగి నగర్ చెరువు

ఘనంగా కోదండ రామాలయ ముఖమండపం ప్రారంభోత్సవం

ప్యారీస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు అగ్రహారంలో శ్రీ ఆంధ్ర కళా స్రవంతి నిర్వహణలోని కోదండ రామాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయ ముఖ మండపం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ఆలయ శిఖర కలశాలకు అభిషేకం, గోమాత పూజ, నవధాన్య హోమం తదితర పూజలను వేద పండితుడు సుసర్ల కుటుంబ శాస్త్రి బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆస్కా మాజీ అధ్యక్షుడు, ప్రముఖ ఆర్కిటెక్ ఎం.ఆదిశేషయ్య నూతన ఆలయ ముఖ మండపాన్ని వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, జై శ్రీరామ్ నామస్మరణల మధ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్ర కళా స్రవంతి సామాజిక, ఆధ్యాత్మిక సేవలో రాణించడం ప్రశంసనీయమన్నారు. స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు మాట్లాడుతూ... అమెరికాలో వృత్తిరీత్యా రాణిస్తున్న ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ ఎస్ గుప్తా సరోజాదేవి దంపతులు, కుమారులు డాక్టర్ బి.రాంప్రసాద్-సుదీక్షణ, వి.విజయభాస్కర్-మాధవి దంపతులు, కుమార్తె డాక్టర్ బి.రేవతి-డాక్టర్ బి.రెడ్డి ప్రసాద్ దాతృత్వంతో ఆలయ శ్రీ ముఖ మండపం అద్భుత శిల్పకళానైపుణ్యంతో నిర్మించి శ్రీరాముడి కృపకు పాత్రులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథులు, దాతలను శాలువతో కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. స్రవంతి సలహాదారులు ఎమ్మెస్ మూర్తి, కార్యదర్శి జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, ఉపాధ్యక్షులు కేఎస్ సురేష్‌బాబు, వీఎస్ హరినాథ్, కమిటీ సభ్యులు, నిర్వాహకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.


డాక్టర్ బీఎస్ గుప్తాను సత్కరిస్తున్న ఆదిశేషయ్య, ఎమ్మెస్ మూర్తి, జేఎం నాయుడు తదితరులు

భక్తులతో కిటకిటలాడిన తిరుచెందూరు ఆలయం

చెన్నై, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా, గురు, పరిహార స్థలాలుగా పేరుగడించిన తిరుచెందూరు ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సముద్రతీరాన ఉన్న ఈ ఆలయాన్ని దర్శించేందుకు మన దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. వారాంతపు సెలవు దినాల్లో ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఈ ఆలయంలో రోగాలను నయం చేసే ఆకుల విభూది కోసం వేలసంఖ్యలో భక్తులు బారులు తీరుతుంటారు. ఇక ఆదివారం వేకువజాము నుండే ఆలయం వద్ద భక్తులు ధర్మ దర్శనం క్యూలైన్, రూ.100ప్రత్యేక దర్శనం క్యూలైన్లో బారులు తీరారు. వేకువజాము 4గంటలకు ఆలయాన్ని తెరిచి, 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఆరుగంటలకు ఉదయమార్తాండగా అభిషేకం నిర్వాహించారు. ఇక ధర్మదర్శనం క్యూలైన్‌లో నిలిచిన భక్తులు స్వామివారిని దర్శించేందుకు గంటకు పైగా వేచి ఉండాల్సి వచింది. ప్రత్యేక దర్శనం క్యూలైన్ భక్తులు అరగంటలోపున దర్శించుకోగలిగారు. ఇక ఉదయం నుంచే సముద్రతీరంలో భక్తులు స్నానమాచరించి, నాళికినరు వద్ద పవిత్ర జలాలను చల్లుకుని స్వామివారిని దర్శించేందుకు క్యూలైన్లలో నిలిచారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేపట్టారు.




తాటి విత్తనాలు నాటుతున్న కలెక్టర్

జోరుగా తాటి విత్తనాలు నాటే కార్యక్రమం

వేలూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడతగా 7,500 తాటి విత్తనాలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఆనైకట్టు నియోజకవర్గం విరింజిపురం చెరువు గట్టుపై తాటి విత్తనాలు నాటే కార్యక్రమంలో ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, జిల్లా పంచాయతీల అధ్యక్షుడు బాబు, పథకం అధికారి సెంథిల్‌కుమారన్, సబ్ కలెక్టర్ బాలసుబ్రమణి, ఎక్సైజ్ అసిస్టెంట్ డైరెక్టర్ మురుగన్, ఆనైకట్టు పంచాయతీ అధ్యక్షురాలు చిత్ర, తహసీల్దార్ వేండా, బీడీవోలు పారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాంబన్ కొత్త వంతెనలో విద్యుత్ రైలు ట్రయల్ రన్

ప్యారీస్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా మండపంలో రూ.535 కోట్లతో సముద్రం మధ్య నూతనంగా నిర్మించిన వంతెనపై విద్యుత్ రైలు ట్రయల్ రన్ శనివారం విజయవంతంగా సాగింది. మండపం రైల్వేస్టేషన్ నుంచి 17 గూడ్సు బోగీలతో బయల్దేరిన విద్యుత్ రైలు 35 కి.మీ వేగంతో రామేశ్వరానికి చేరుకుంది. అనంతరం క్రమక్రమంగా 45 కి.మీ వేగం, 60 కి.మీ వేగంతో ట్రయల్ రన్ పూర్తిచేసింది. ఆంగ్లేయుల కాలంలో మండపం ప్రాంతంలో నిర్మించిన పాంబన్ రైలు వంతెనలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణం వల్ల కొత్త రైలు వంతెన నిర్మాణపనులు చేపట్టడంతో 2023 డిసెంబరు 23వ తేది నుంచి ఆ వంతెనపై రైలు సేవలు పూర్తిగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, కొత్తగా నిర్మించిన పాంబన్ రైలు వంతెన నుంచి పాంబన్ వరకు ఉన్న రైలు మార్గంలో ప్రమాదాలను ముందుగానే పసిగట్టే సెన్సార్ పరికరాలను పొందుపరిచారు. వంతెన స్థిరత్వం, ప్రకంపనలపై పరిశోధనలు నిర్వహించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో త్వరలోనే సీనియర్ రైల్వే భద్రత శాఖ అధికారి నేతృత్వంలో పాంబన్ వంతెనను అధికారపూర్వకంగా ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.



చికిత్సా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, కాశీవిశ్వనాథ్ తదితరులు

కావేరి జీరో పెయిన్ సెంటర్ ప్రారంభం

చెన్నై అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలో కావేరి హాస్పిటల్‌లో దీర్ఘకాలిక వెన్నెముక నొప్పి, క్యాన్సర్ నొప్పులు, నరాల నొప్పులతో బాధపడే రోగుల కోసం బాధారహిత చికిత్సలందించడానికి 'కావేరి జీరో పెయిన్ సెంటర్' పేరుతో ప్రత్యేక చికిత్సా కేంద్రం ఏర్పాటైంది. ఈ కేంద్రాన్ని చెన్నై సూపర్‌కింగ్స్ సీఈఓ కాశీవిశ్వనాథ్, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ ఆర్ఎన్ బాబా ప్రారంభించారు. కావేరి హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెరిగిన ఎండు చేపల ధరలు

పెరంబూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా సాయల్‌గుడి సమీపంలో వీవీఆర్ నగర్‌లో ఎండు చేపల ఉత్పత్తి సంస్థలున్నాయి. తూత్తుకుడి, రామేశ్వరం, పాంబన్, కన్నియాకుమారి, కుళచ్చల్, ముట్టం తదితర ప్రాంతాల నుంచి నగరై, కారా, సూవారై, ఊళి, పన్న, కత్తాలై, షీలా, వాలై, ముట్టపారై, మావులా తదితర రకాల చేపలను ఈ సంస్థలు కొనుగోలు చేస్తుంటాయి. వాటిని ఉప్పు తొట్టిల్లో నానబెట్టి, కొబ్బరి చాపలపై ఆరబెడతారు. షీలా, మావులా, వాలై, పారై తదితర చేపల పేగుల భాగాన్ని తీసివేసిన తర్వాత, ఉప్పు, పసుపు పూసి ఇసుకలో సురక్షితంగా పాతిపెట్టి, 10 రోజుల తర్వాత వెలికితీస్తారు. అలా చేపలు ప్రాసెస్ చేసి ఎండబెట్టి ఇతర ప్రాంతాలకు పంపిస్తుంటారు. ప్రస్తుతం వర్షాల కారణంగా ఎండు చేపల ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. దీంతో వాటి ధరలు పెరిగాయి. ఈ విషయమై వ్యాపారి జాన్సన్ మాట్లాడుతూ... పెద్ద సైజు మొదటి రకం షీలా చేపలు కిలో రూ.800 విక్రయిస్తుండగా ప్రస్తుతం రూ.1,000 నుంచి రూ.1,200 వరకు, ఇతర రకాలు కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగాయని తెలిపాడు.





పచ్చగా.. కనువిందుగా..

ఇలా పచ్చని మొక్కలతో.. కనువిందుగా ఉన్న ఈ డివైడరు ఉండేది తిరుపతి నగరం చింతలచేనుకు తూర్పుగా ఏర్పాటుచేసిన కులశేఖర్ ఆళ్వార్‌రోడ్డులో. రోడ్డు మధ్యలో దాదాపు 10అడుగుల వెడల్పుతో సువాసన ఇచ్చే పలు రకాల పుష్పాలు, పత్రాల మొక్కలను నాటారు. ఈ దారిలో రాకపోకలు సాగించే వారితో పాటు.. అటు పక్కన వెళ్లే రైలులోని ప్రయాణికులనూ ఆకట్టుకుంటున్నాయి. ఇటుగా వెళ్లే వారు డివైడరు వద్ద ఫొటోలు దిగుతున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఇలా నెట్టుకొచ్చారు

కదిలితేనే బండి. లేదంటే మొండి. ఇలా మొరాయించిన ట్రాక్టరును ఆదివారం ఉదయం తిరుపతిలో తాపీ కూలీలు తోసుకుంటూ వెళ్లారు. భవనస్లాబ్ కోసం మిక్సర్, ఇతర పరికాలతో పాటు కూలీలు కరకంబాడి రోడ్డు సమీపం నుంచి ట్రాక్టర్, ట్రాలీతో బయలుదేరారు. లీలామహల్ సమీపానికి చేరుకోగా ట్రాక్టర్ ఆగిపోయింది. ఎంతకీ స్టార్టు కాకపోవడంతో మెకానిక్ షెడ్డు వరకు ఇలా తోసుకుంటూ వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



సోది చెబుతామమ్మా..



బుర్రలు చేతపట్టి 'సోదమ్మో సోది' అంటూ తీర ప్రాంత పల్లెల్లో తిరిగేవారు ఇటీవల పెరిగారు. వీరిపై నమ్మకంతో కొందరు మహిళలు సోది చెప్పించుకుంటున్నారు. గతంలో 'సోది' చెప్పే బుర్రక్కలకు ఆదరణ ఉండేది. ఇదే జీవనాధారంగా ఎన్నో కుటుంబాలు బతికాయి. మారుతున్న కాలాన్ని బట్టి సోది మాటే లేకుండా పోయింది. అయితే, దసరా నుంచి కోట, వాకాడు, చిట్టమూరు తదితర సముద్రతీర మండలాల్లో సోది బుర్రక్కల సందడి ఉంటోంది.


- కోట, ఆంధ్రజ్యోతి



సందర్శకులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన కాటేజీ



గెస్ట్ హౌస్‌ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్‌లు



డార్మెటరీలో ఏర్పాటు చేసిన పడకలు

చుట్టూ ఎత్తయిన చెట్లు. స్వచ్ఛమైన గాలి. పక్షుల కిలకిలరావాలు. వీటి నడుమ ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకుంటున్నారా? ఉరుకుల పరుగుల జీవితం నుంచి కాసింత ఆహ్లాదానుభూతులను పొందాలనుకుంటున్నారా? అయితే, మామండూరు వెళ్లాల్సిందే.

- మంగళం, ఆంధ్రజ్యోతి

రారండోయ్.. మామండూరు

● మానసికోల్లాసానికి 'వాటర్ ఫ్లో'

ఎలా వెళ్లాలంటే..

కడప వెళ్లే దారిలో తిరుపతికి 22 కి.మీ. దూరంలో మామండూరు ఉంది. బస్సు లేదా సొంత వాహనాల్లో ఇక్కడకు చేరుకోవచ్చు. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు లోపలకు వెళితే గెస్ట్‌హౌస్ ఉంటుంది. ఇక్కడకు మాత్రం బస్సు సౌకర్యం లేదు. సొంత వాహనాల్లో వెళ్లేవారు కార్లు, జీపులకు రూ.20, ఆటోకు రూ.15, ద్విచక్ర వాహనానికి రూ.10 చెల్లించాలి. గెస్ట్‌హౌస్ నుంచి కిలోమీటరు దూరంలో ముచ్చటగొలిపే నీటి ప్రవాహం (వాటర్ ఫ్లో) ఉంది.



గుంట మడుగు వద్ద వాచ్ టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తున్న సందర్శకులు

ఎంచక్కా బస చేయవచ్చు

ప్రవేశ రుసుం రూ.30 చెల్లించి సాయంత్రం వరకూ ప్రకృతి అందాలను చూడవచ్చు. కటక్, గుంజర, తుంబుర, హరిణి, మయూరి పేర్లతో కాటేజీలున్నాయి. రోజుకు రూ.3వేలు చెల్లించాలి. రెండు బెడ్లు ఉంటాయి. డార్మెటరీకి రూ.6వేలు చెల్లించాలి. ఇందులో 10 బెడ్లు ఉంటాయి. 'వనదర్శిని' వెబ్‌సైట్ ద్వారా గదులు బుక్ చేసుకోవచ్చు. బస చేసేవారు ఆహారాన్ని తీసుకెళ్లవచ్చు. లేదనుకుంటే వండి సరఫరా చేసేందుకు ఓ క్యాంటీన్ ఉంది. ముందుగా ఆర్డర్ ఇస్తే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం తయారు చేస్తారు.

ఎప్పుడు అనుకూలం

తిరుమల కొండల్లోని పాపవినాశనం, గోగర్భం డ్యాం నిండాక నీరు ఇక్కడకు చేరుకుంటుంది. వర్షాల సమయంతో జలపాతాలు కనువిందుచేస్తాయి. నడుము లోతు వరకు వచ్చే ఈ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఈత కొడుతూ మైమరచిపోతారు. ప్రమాదం లేకుండా జలకాలాడటానికి ఇక్కడి వాతావరణం అనుకూలం. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు నీటి ప్రవాహం ఉంటుంది. రోజూ దాదాపు 1,500మంది, అన్‌సీజన్‌లో 400మంది వస్తుంటారు. పిల్లలు ఆడుకోడానికీ కొన్ని సౌకర్యాలున్నాయి.



మామండూరు వద్ద వాటర్ ఫ్లో

త్వరలో జంగిల్ సఫారి



సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచడానికి త్వరలో జంగిల్ సఫారీ ప్రారంభించబోతున్నాం. గెస్ట్ హౌస్ నుంచి అటవీ ప్రాంతంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాల్లో వెళ్లి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు రోడ్డు వేశారు. జంగిల్ సఫారీలో అందమైన అటవీప్రాంతాన్ని వీక్షించవచ్చు.

- గౌస్ కరీం, డీఆర్వో

రైతు మోమున లాభాల గుబాళింపు

● పూలసాగుపై పెరుగుతున్న ఆసక్తి
● పండగలొస్తే మరింత లాభసాటి ● వర్షాలకు అడపాదడపా నష్టం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి: ఎర్రావారిపాలెం మండలంలోని రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల దసరా సందర్భంలో మంచి గిట్టుబాటు ధర లభించడంతో వీరిలో ఆనందం వ్యక్తమవుతోంది. సుమారు రెండునెలల్లోనే చేతికందడంతో ఎక్కువమంది బంతి పూలసాగు వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రస్తుతం కిలో బంతిపూల ధర రూ.40కి తక్కువ లేకుండా పలుకుతోంది. పండుగ సందర్భాల్లో ధర మరింత పెరిగి లాభసాటిగా మారుతోంది. బంతితోపాటు ఇతర పూల పంటలనూ సాగుచేస్తున్నారు. రోజాలు కిలో రూ.160, సెంటు మల్లెలు రూ.200 చొప్పున ధర పలుకుతున్నాయి. మండలంలోని పెద్దనాయనపల్లె, బడగన పల్లె,ఎల్లమంద, ఉస్తికాయల పెంట గ్రామాల్లో రైతులు బంతి సాగు చేస్తున్నారు. భాకరాపేట-తలకోన రోడ్డు పక్కనే పెద్దనాయనిపల్లె వద్ద సాగు చేసిన పూలతోటలకు మంచి డిమాండు ఉంది. రోడ్డు పక్కనే ఉండడంతో తోటలోని పూలు కోసి వెంటనే ఇస్తుండటంతో చాలామంది ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. దీంతో దళారుల బెడద, కమీషన్ లాంటివి లేకుండా వెంటనే చేతికి డబ్బు అందుతోందని చెప్పారు. వ్యాపారులకు పూలను సరఫరా చేస్తే కమీషన్, తోపుడు రిస్కు(అదనంగా పూలు) ఉంటాయంటున్నారు. డబ్బులు సరిగా చెల్లించకపోవడంతో అడపాదడపా నష్టపోతున్నామంటున్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంలోనూ మంచి ధర పలుకుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. వర్షాలొస్తే పూల రేకుల్లో నీరు చేరితే కుళ్లిపోయినా, నానినా నాణ్యత తగ్గుతుంది. ఇలాంటప్పుడు తక్కువ ధరకు అమ్మి వీరు నష్టపోతున్నారు. వర్షాకాలంలో చీడ పీడలు, తేమ శాతం ప్రతికూలంగా పరిణమిస్తున్నాయి. ఉద్యాన అధికారులు అధిక దిగుబడినిచ్చే విత్తన మొలకలు సరఫరా చేస్తే నాణ్యమైన పూలతోటలను సాగు చేసి మరిన్ని లాభాలు ఆర్జిస్తామని రైతులు చెబుతున్నారు.





అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. చెన్నైకు చెందిన శ్రీశంకర నాట్యాలయ వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు హర్షదా, అనూష, అక్షర, సహానా, రోషికా, దీప్తి, సంగీత, ధాన్వియ, ప్రగతి, బవదర్శిని తదితరులు శివ శ్లోకం, శ్రీరామచంద్రుడు, స్వాగతం కృష్ణా సుస్వాగతం కృష్ణా, కన్నన్ వరుగింద్ర నీరం, అదిదానో రంగా, తోడై మంగళం, హరే రామ రామ గోవింద హరే వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వారిని ఆదివారం తెలంగాణ, మద్రాసు హైకోర్టుల న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ సుధీర్ కుమార్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ రాజేశ్వరరావు



జస్టిస్ సుధీర్‌కుమార్

శ్రీవారికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చాం

తిరుమల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గోపిచంద్ 'విశ్వం' సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన క్రమంలో వేంకటేశ్వరస్వామిని కృతజ్ఞతలు తెలుపుకునేందుకు వచ్చామని ఆ చిత్ర దర్శకుడు శ్రీను వైట్ల తెలిపారు. నిర్మాత వేణుదోనేపూడి, నటుడు శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీను వైట్ల ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. స్వామికి ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు. విశ్వం చిత్రాన్ని హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలన్నారు. 'దేవర' సినిమాలో భాగస్వామిని కావడం సంతోషంగా ఉందని నటుడు శ్రీకాంత్ తెలిపారు. కొన్ని కారణాల వల్ల గోపిచంద్ దర్శనానికి రాలేకపోయారని, ఆయన బదులుగా తాను ఉన్నట్టు అందరు భావించాలన్నారు. తాను నటించిన గేమ్‌ఛేంజర్ సంక్రాంతికి విడుదల కానుందన్నారు. కల్యాణ్‌రామ్, సాయిధరమ్ తేజ్‌తో నటించిన చిత్రాలు కూడా త్వరలో విడుదల కానున్నాయన్నారు. వీటి తర్వాత తాను హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు. తన కుమారుడు రోషన్ 'ఛాంపియన్' అనే సినిమా షూటింగ్‌లో బీజీగా ఉన్నాడని ఓప్రశ్నకు బదులిచ్చారు.



ఆలయం ఎదుట శ్రీను వైట్ల, శ్రీకాంత్, వేణు దోనేపూడి

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు





ప్రమాదానికి గురైన కారు - క్షతగాత్రులు

● ముగ్గురికి గాయాలు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో ఆదివారం కారు అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. తమిళనాడుకు చెందిన భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఆదివారం ఉదయం తిరుమల నుంచి తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 15వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడివైపు నున్న క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ మహిళ గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో తిరుపతికి రుయా ఆస్పత్రికి తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 80,741 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

మందలించాడని..

● కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేసిన విద్యార్థి
● పోలీసుల అదుపులో బాలుడు.. కేసు నమోదు

తిరుచానూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోజనం చేస్తున్న సమయంలో మందలించారని.. తన ప్రవర్తన తీరుపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని ఆగ్రహించిన విద్యార్థి.. క్షణికావేశంతో కళాశాల ఇన్‌ఛార్జిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం అడుసుపల్లికి చెందిన వెంకటరమణ తిరుపతిలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఆయన తిరుచానూరులోని బ్రాంచిలో ఉన్నారు. పీలేరుకు చెందిన ఇంటర్ విద్యార్థి.. దసరా సెలవులకు వెళ్లి ఆదివారం రాత్రి క్యాంపస్‌కు వచ్చాడు. రాగానే కళాశాలలో పనిచేసే ఉద్యోగి వెంకటరమణ ఫీజు అడగారు. సమాధానం లేకపోవడంతో అక్కడ కూర్చోబెట్టారు. అదే సమయంలో అతడి తల్లిదండ్రులకు ఫోను చేయగా వారి నుంచి సమాధానం లేదు. అంతకు ముందే ఆ విద్యార్థిపైన కళాశాలలోని వారు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు తీవ్రస్థాయిలో అతడిని మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆ విద్యార్థి.. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆదివారం రాత్రి కళాశాలకు రావడం.. ఫీజు విషయమై ప్రశ్నించారు. అప్పటికే తనపై తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారని, తాను భోజనం చేసే సమయంలో అందరి ముందు అసభ్యంగా మాట్లాడారని ఉద్యోగి రమణపై కోపం పెంచుకున్న విద్యార్థి.. బ్యాగులోని కత్తి తీసి దాడి చేశాడు. కళాశాల యాజమాన్యం విద్యార్థిని తిరుచానూరు పోలీసులకు అప్పగించి, గాయపడిన వెంకటరమణను రుయాకు తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షణికావేశంలో తాను దాడికి పాల్పడినట్లు విద్యార్థి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.



గాయపడిన వెంకటరమణ